క్లుప్తంగా

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

దమ్మపేట: విద్యుత్, తాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ.. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆదివారం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. మండలంలోని మల్లారం శివారులో తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకుని, నివాసం ఉంటున్న పలు కుటుంబాలు తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలువురు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుంకిపాక ధర్మ, బత్తుల సాయి, మణికంఠ, లక్ష్మీనారాయణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రతిష్ఠ మహోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీతారామ నగర్ కాలనీలో శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి నూతన దేవాలయంతో పాటు విగ్రహ, ధ్వజస్తంభ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమైన్నాయి. ఈ సందర్భంగా మూలమూర్తులను పట్టణంలో మేళతాళాలతో మహిళా భక్తుల కోలాట నృత్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో హోమాలు, యాగాలను రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలను తిలకించారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

పినపాక: పురుగు మందుల దుకాణాల్లో రికార్డులు తప్పనిసరిగా పాటించాలని ఏఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఎస్సై రాజ్ కుమార్‌తో కలిసి మండలంలోని జానంపేట, పినపాక, దుగినేపల్లి గ్రామాల్లో ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినా, నిషేధిత పురుగు మందులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. లైసెన్స్ లేని వారు విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శికి పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని సీతరాంపురం గ్రామానికి చెందిన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధును, ఆయన కుటుంబసభ్యులను సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు. మధు తండ్రి నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందగా.. సంస్మరణ కార్యక్రమానికి సీపీఎం నాయకులు హాజరయ్యారు. మధు కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుక్లారి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఉన్నారు.

సెలవు ప్రకటించాలి

మణుగూరుటౌన్: వేలాది మంది ఆత్మ బలిదానాలు చేసి సాధించిన తెలంగాణ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన కార్మికులకు.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెలవు రోజుగా ప్రకటించాలని హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ కొడిపల్లి శ్రీలత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటనలో విడుదల చేశారు. నాడు కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులు కలిసి చేసిన సమ్మె వల్లనే తెలంగాణ సిద్ధించిందన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అశ్వాపురం: ఇటీవల మేడారంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీతరాంపురం వాసులు చెట్టిపల్లి సీత, నూప దుర్గ కుటుంబాలను, గాయపడిన సమ్మయ్యను ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, పిట్టా కృష్ణారెడ్డి, నల్లపాటి సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గొల్లపల్లి నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగానమ్మ తల్లికి పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు దిగువ ప్రాంతంలోని గంగానమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సం సందర్భంగా ఆదివారం కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా.. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అలాగే అమ్మవారికి మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో బోనాలను తీసురాగా, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్న సమయంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్థిక భద్రతకు భరోసా

- జీపీ కార్మికులకు బ్యాంకు ఖాతాల్లో వేతనాలు
- ఏళ్లనాటి పోరాటాలకు సత్ఫలితం
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు



పంచాయతీ కార్మికుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు



కరకగూడెంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

కరకగూడెం: గ్రామ పంచాయతీ కార్మికులకు ఇకపై నేరుగా వేతనాలు అందనున్నాయి. ఇది వారి దీర్ఘ కాల పోరాటాలకు ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం. సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు తగిన గుర్తింపు, సకాలంలో వేతనాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిధుల కొరత, అడ్మినిస్ట్రేటీవ్ ఆలస్యం వంటి కారణాలతో వేతనాలు ఆలస్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో కార్మికులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, అప్పులు తీసుకోవడం, జీవనోపాధి కోసం పోరాడటం సర్వసాధారణంగా మారింది. దీనిపై ఎన్నో ఆందోళనలు, సమ్మెలు చేపట్టారు. ఈ పోరాటాలు రాష్ట్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించి చివరకు నేరుగా వేతనాలు వారి బ్యాంకు అకౌంట్లలో చెల్లించే విధానాన్ని అమలు చేయడానికి మార్గం ఏర్పడింది.

నూతన విధానం ఇలా..

ఇప్పటి వరకు పంచాయతీ కార్మికులకు నెల వారి వేతనాలను ఆయా గ్రామ పంచాయతీ బ్యాంకు అకౌంట్లో ప్రభుత్వం వేసేది. ఆ డబ్బుల మేర చెక్కులను రాసి పంచాయతీ కార్యదర్శులు కార్మికులకు ఇచ్చేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం.. గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు, ప్రతి నెలా మొదటి వారంలో నేరుగా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో వేతనాలు జమ అవుతాయి. ఈ విధానం ఈ నెల, లేదా వచ్చే నెల నుంచి అమలు అవ్వడం ఖాయమని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు..

ఈ నూతన విధానంలో భాగంగా కార్మికుల వేతనాలకు సంబంధించిన బ్యాంకు అకౌంట్, తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పలు ధపాలుగా నమోదు చేశారు. కార్మికుల వేతనాలు, పని వివరాలు, ఇతర సంబంధిత సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. దీనివల్ల అడ్మినిస్ట్రేటీవ్ సామర్థ్యం పెరుగుతుంది. ఈ డిజిటల్ విధానం కార్మికులకు తమ వేతనాల వివరాలను సులభంగా పొందే అవకాశం ఉంటుంది.

కార్మికులకు ప్రయోజనాలివే..

ఈ నూతన విధానం గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడతారు. అప్పులు తీసుకోని ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదు. ఇది వారి కుటుంబాల ఆర్థిక భద్రతను పెంచుతుంది. ఆన్‌లైన్ విధానం ద్వారా వేతనాల చెల్లింపు, నిధుల వినియోగంలో పారదర్శకతను తెస్తుంది.

కార్మికులు తమ వేతనాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. కాగా, ఈ నిర్ణయం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత వారి కష్టానికి తగిన గుర్తింపు లభించడం వారిలో ఆనందాన్ని నింపింది.

ఎదురుచూసే వాళ్లం..



ఎన్నో ఏళ్లగా గ్రామ పంచాయతీ కార్మికుడిగా సేవలందిస్తున్న. కొన్ని సార్లు వేతనాల కోసం ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడు నేరుగా మా బ్యాంకు ఖాతాలోకి జీతం వస్తుందని తెలియగానే చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. కార్మికుల సంక్షేమానికి మరిన్ని పథకాలు అమలు చేయాలి.

– నైనారపు మల్లయ్య, కార్మికుడు, కరకగూడెం జీపీ

కష్టానికి తగిన గుర్తింపు..



మా కష్టానికి తగిన గుర్తింపు లభించింది. సకాలంలో డబ్బులు చేతికొస్తే పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు చూసుకోవచ్చు. ఇదివరకు వేతనాలకు సంబంధించి ఇచ్చిన చెక్కుల మార్పిడికి దూరంగా ఉన్న బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ కష్టాలు తీరినట్టే.

– నిట్ట ప్రసంగి, కార్మికుడు, సమత్ భట్టుపల్లి జీపీ

ప్రోత్సాహకంగా పనిచేస్తుంది..



పంచాయతీ కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించింది. నేరుగా వేతనాలు అందించడం ద్వారా వారి ఆర్థిక భద్రతకు భరోసా కల్పించడమే కాకుండా, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మరింత సమర్థవంతంగా జరిగేలా ఇది ప్రోత్సహిస్తుంది. త్వరలో వారి ఖాతాలో వేతనాలు జమవుతాయి.

– దేవ వర కుమార్, కరకగూడెం ఎంపీడీఓ

మేమింతే.. మారమంతే..

- జాతీయ రహదారిపైనే సంత
- ప్రమాదాలకు అవకాశం
- అధికారుల ఆదేశాలు బేఖాతర్



సారపాకలో జాతీయ రహదారి పక్కనే కొనసాగుతున్న అమ్మకాలు

బూర్గంపాడు: సారపాక మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంత ప్రమాదాలకు నెలవుగా మారింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి పక్కన సంత దుకాణాలు నిర్వహిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన స్థానికులలో వ్యక్తమవుతుంది. సారపాకలోని లారీ యార్డ్ వద్ద గాంధీనగర్‌కు వెళ్లే దారిలో సంత నిర్వహించుకోవాలని గ్రామపంచాయతీ అధికారులు సూచించారు. అయితే కొందరు దుకాణాదారులు మాత్రం జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణాలు నిర్వహిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు, కొనుగోలు చేసేవారికి జాతీయ రహదారి పక్కన దుకాణాలు ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రాంతంలో తరచు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గత వారం ఓ లారీ డ్రైవర్ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో కల్వర్ట్‌కు ఢీ కొట్టి ప్రాణాలు కోల్పోయాడు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ సంత దుకాణాలను మాత్రం జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తుండటం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్‌ను వివరణ కోరగా.. జాతీయ రహదారి పక్కన దుకాణాలు పెట్టవద్దని పలుమార్లు హెచ్చరించామన్నారు. సంత వేలం పాటదారుడికి నోటీసులు జారీ చేశామన్నారు. కొందరు దుకాణాదారులు మాత్రం ఎవరు చెప్పిన లెక్కచేయకుండా జాతీయ రహదారి పక్కనే సంత నిర్వహిస్తున్నారని వారిపై పోలీసుల ఫిర్యాదు చేస్తామన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున సరుకులు కొనుగోలు చేసేందుకు వారపు సంతకు వస్తుండగా.. వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారుల్లో మోహరించిన పోలీసు బలగాలు వచ్చిపోయే వారిని నిశితంగా తనిఖీ చేశారు. లెనిన్ కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కుర్నపల్లి రోడ్‌లలో ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారించి నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి, కేశవ్‌ల నేతృత్వంలో ఈ తనిఖీలు నిర్వహించగా.. సివిల్, స్పెషల్‌పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

ఏరియా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటీవ్‌గా జ్యోతిర్మయి



డీవైసీఎంఓ జ్యోతిర్మయిని సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటీవ్‌గా జ్యోతిర్మయి నియమితులయ్యారు. ఏసీఎంఓగా ఉన్న మేరీకుమారి పదవీ విరమణ పొందడంతో ఏరియా ఆస్పత్రి డీవైసీఎంగా ఉన్న జోతిర్మయికి ఆ బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సీనియర్ సర్జన్ వైద్యురాలిగా కొనసాగుతున్న జ్యోతిర్మయికి అడ్మినిస్ట్రేటీవ్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించడంపై టీబీజీకేఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి ఆధ్వర్యంలో వైద్యురాలికి శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైరవీలకు తావివ్వకుండా ఏరియా కార్మిక కుటుంబ సభ్యుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇబ్రాయిల్, పవన్‌కుమార్, నాగేశ్వరరావు, ముకేశ్, రాజ్‌కుమార్, పద్దం శ్రీనివాస్, రమేశ్‌బాబు, ఫిట్ సెక్రెటరీ, వినయ్‌కుమార్, నరేశ్, రేవన్, జ్యోతి తదితరులు ఉన్నారు.

ఏఎస్పీ టౌన్ కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: పట్టణంలోని రాజుపేట కాలనీలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఎస్పీ నూతన టౌన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. టౌన్ అధ్యక్షుడిగా పాడెం సురేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా గుంపెనపల్లి విజయ్, సమాచార కార్యదర్శిగా కుంజ వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా కూరం బుర్రయ్య, టౌన్ కార్యదర్శులుగా కల్లూరి బాలు, సోయం రమేష్, ఎస్. భద్రంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. పట్టణంలో ఆదివాసీల సమస్యలపై పోరాటాలు నిర్వహించి ఏఎస్పీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వసంత్, సత్యనారాయణ, కారం గోపాలరావు, కారం మురళి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ నిర్మాణ పనులు పరిశీలన



డివైడర్ పనులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

అశ్వాపురం: మండల కేంద్రంలో రూ.4 కోట్లతో జరుగుతన్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులను పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, డివైడర్, రహదారి విస్తరణకు రూ.4 కోట్లు మంజూరు చేయించానన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, నాయకులు మర్రి మల్లారెడ్డి, జాలె రామకృష్ణారెడ్డి, వెంకటరామయ్య, రామ్మూర్తి, గద్దల రామకృష్ణ, గుంపెన శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెంలో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశాన్ని నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అధికారులంతా హాజరవుతారని తెలిపారు. గడిచిన 18 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై అధికారుల సమక్షంలో సమీక్ష జరుపుతామని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

భద్రాచలంటౌన్: ఐటీడీఏ విద్యా శాఖలోని పీఎంఆర్సీ కార్యాలయంలో ఏసీఎంఓగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన తెల్లం రమణయ్యను పలువురు సన్మానించారు. ఆదివారం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ట్రైకార్ జీఎం శంకర్రావుతో కలిసి రమణయ్య దంపతులకు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అహర్నిశలు పాటుపడ్డ నిరాడంబరుడు రమణయ్య అని అన్నారు. అనంతరం పీఓ రాహుల్ మాట్లాడుతూ.. ఉద్దీపకం వర్క్ బుక్స్ నుంచి కెరీర్ గైడెన్స్ వరకు అవగాహన కల్పించడంలో రమణయ్య కృషిని కొనియాడారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, వివిధ శాఖల అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యకు జ్ఞాపిక అందిస్తున్న పీఓ రాహుల్, ఎమ్మెల్యే వెంకట్రావ్

పర్ణశాలకు పోటెత్తిన భక్తులు



నారచీరల వద్ద భక్తుల రద్దీ..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి భారీగా పెరిగింది. వేసవి సెలవులు చివరకి రావడంతో ప్రజలు కుటుంబసభ్యులతో పర్ణశాలకు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. పంచవటీ కుటీరం, నార చీరల ప్రాంతాలను భక్తులు సందర్శించారు. అనంతరం పవిత్ర గోదవరి నదీలో బోట్ షికార్ చేస్తూ సందడి చేశారు. పర్ణశాలకు భారీగా భక్తులు తరలిరావడంతో పర్ణశాలలోని దుకాణాలు, హోటళ్లు జనాలతో నిండిపోయాయి.

కథా పఠనంలో ప్రతిభ

అశ్వారావుపేటరూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.సుమనశ్రీకి కథా పఠనంలో ప్రశంసా పత్రం లభించినట్లు ప్రధానోపాధ్యాయురాలు హరిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం మాట్లాడుతూ.. ఆంధ్ర సారస్వత పరిషత్ అంతర్జాలంలో శనివారం రాత్రి బాలకథా సమ్మేళన పోటీలను నిర్వహించగా.. సుమనశ్రీ తాను రచించిన 'గెలుపు' అనే కథను చదివి వినిపించింది. దీంతో కథా శైలి, పఠన విధానాన్ని నిర్వాహకులు, సమన్వయకర్తలు ప్రశంసించారు. అనంతరం అంతర్జాలం ద్వారా విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని పంపించి, అభినందించారు. కాగా, సదరు విద్యార్థినికి ఇటీవలె నిర్వహించిన వేసవి శిబిరంలో కాంప్లెక్స్ సీఆర్‌పీ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారని ఈ సందర్భంగా హెచ్‌ఎం తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని భారత్ విద్యానికేత్ శివలింగాపురంలో 2008–09లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఆట పాటలతో ఆనందంగా విద్యార్థుల గత స్మృతులను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, సత్యవతి, ప్రమీల, విజయసేన్, సుధారాణి తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- చేతికి అందే ఎత్తులోనే ఏర్పాటు
- రక్షణ చర్యలూ లేవు..
- చుట్టూ తీగ చెట్లు అల్లుకుంటున్నా.. నిర్వహణ కరువు..



యూబీ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఇండస్ట్రియల్ ఏరియాలో చేతికి అందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రమాదాలను కొనితెచ్చేలా ఉంది. భద్రాచలం పట్టణంలో ప్రజల అవసరాల కోసం ప్రధాన రహదారి, కాలనీల్లోని మార్గాల గుండా భారీ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటిని చేతికందే ఎత్తులోనే ఏర్పాటు చేయడం, చుట్టూ కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం ముంచుకొస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

జనావాసాల మధ్య..

భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో పలు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మనుషులు సంచరించని చోట్ల అయితే ఫరవాలేదు కానీ జనాలు ఎక్కువగా తిరిగే చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ రహితంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న స్తంభాలకు ఫ్యూజ్ బాక్సులు, మీటర్లను ఏర్పాటు చేశారు. కాగా ఈ ఫ్యూజ్ బాక్సుల నిర్వహణ కూడా లోపభూయిష్టంగా తయారైంది. వీటి మూతలు నిరంతరం తెరుచుకుని ఉంటున్నాయి. ఇదిలా ఉండగా తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్సుల మూతలు ఎప్పుడు ఊడి పోతాయో అన్నట్లుగా తయారయ్యాయి. అందులోంచి వేలాడుతూ బయటకు వచ్చిన విద్యుత్ తీగలు కూడా ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

లోపించిన నిర్వహణ

పట్టణంలో కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచం ఉన్నప్పటికీ నిర్వహణ లోపిస్తోంది. విద్యుత్ అధికారులు తరచూ పర్యవేక్షించడం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరుగుతున్నాయి. వాటిల్లోని తీగజాతి మొక్కలు క్రమంగా ట్రాన్స్‌ఫార్మర్లను మెలివేసుకుంటూ పైకి పాకుతున్నాయి. ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు జరిగితే పిచ్చిచెట్ల మధ్య చర్యలు చేపట్టడం విద్యుత్ సిబ్బందికి కష్టతరంగా మారుతుంది.



పోస్ట్ ఆఫీస్ ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు..

ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్..

కాగా భద్రాచలం హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్ రోడ్డులోని ఓ షాపింగ్ మాల్ నిర్వాహకులు తమకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ పంచాయతీ స్థలంలోని ఏర్పాటు చేసుకున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాల్సిందిగా విద్యుత్ అధికారులు ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ యాజమాన్యం ససేమీరా అంటున్నట్లు సమాచారం.


విద్యుత్ బాక్సులు ఇలా..



బాక్స్ నుంచి బయటకు వచ్చిన విద్యుత్ వైర్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పల్లె ప్రకృతి వనంలో విద్యుత్ బాక్స్‌ల్లో వైర్లు బయటకు వచ్చి చేతికి అందే విధంగా ఉన్నాయి. ప్రతి రోజూ పట్టణ వాసులు వాకింగ్ చేయడానికి, చిన్నారులు ఆటలు ఆడుకోవడానికక్కీ ప్రకృతి వనానికి వస్తుంటారు. చిన్నారులు తెలియక తలిగితే కరెంట్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. వర్షాకాలం వస్తుండడంతో ప్రమాద అవకాశం ఎక్కువగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి బాక్స్‌లకు మూతలను ఏర్పాటు చేసి మరమ్మతులను చేయాలని పలువురు కోరుతున్నారు.


నిర్వహణ కూడా ఉండాలి..



భద్రాచలంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవాలి. పట్టణంలోని కొన్ని కాలనీల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కవచం ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ పట్టించుకోకపోవడం వల్ల వాటి చుట్టూ పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి.

– అశోక్ కుమార్, ఇండస్ట్రియల్ ఏరియా, భద్రాచలం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



భద్రాచలంలో ఏఏ కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయో సిబ్బందితో తనిఖీ చేయిస్తాం. వాటికి ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవాలి అనే వాటిపై చర్చించి సమస్యను పరిష్కరిస్తాము. ప్రస్తుతం వర్షాలు పడుతున్న సందర్భంగా ప్రజలు విద్యుత్ పనులు చేస్తున్న సమయంలో జాగ్రత్తలు పాటించాలి.

– జీవన్ కుమార్, విద్యుత్ శాఖ డీఈ, భద్రాచలం